ప్రజాశక్తి

బుధవారం 20 సెప్టెంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ప్రభుత్వ దగా..!

◆ జగనన్న కాలనీలో భూమి పోయిన పేదలకు మొండిచేయి

◆ ఏళ్లు గడుస్తున్నా దక్కని పరిహారం ◆ లబోదిబోమంటున్న వెదురువాడ డి పట్టాదారులు

పేదల డి పట్టా భూముల్లో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అక్కడ జగనన్న కాలనీకి తీసుకున్న పేదల భూములకు ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు. ఎకరాకు రూ.18 లక్షలు చొప్పున పరిహారం చెల్లిస్తామని తీసుకున్న పదెకరాల్లో సెంటు భూమికి కూడా ఇంతవరకూ పైసా జమచేయలేదు. అటు ప్రభుత్వమిచ్చిన భూమి చేతిలోలేక, కాలనీకి తీసుకున్న భూమికి పరిహారం అందక లబోదిబోమంటున్నారు జిల్లాలోని అచ్యుతా పురం మండలం వెదురువాడ రెవెన్యూలో జగనన్నకాలనీలో భూములు కోల్పోయిన పేదలు.

2005 జనవరి 21న యలమంచిలిలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా వెదురువాడ రెవెన్యూ సర్వే నెంబర్ 1లో వెదురువాడ ఎస్‌సి కాలనీ, గొల్లల వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, తిమ్మరాజుపేట, మోసయ్యపేట, అచ్యుతాపురానికి చెందిన 142 మంది పేదలు, చేతివృత్తిదారులు డి పట్టాలు అందుకున్నారు. అత్యధిక మందికి ఒక్కొక్కరికీ 70 సెంట్లు చొప్పున, కొద్ది మందికి ఎకరా చొప్పున భూమిపై హక్కు కల్పిస్తూ డి పట్టాతో పాటు పాస్ పుస్తకాన్ని లబ్ధిదారులకు అందజేశారు. విస్తీర్ణం ప్రకారం సరిహద్దులు వేసి భూమి అప్పగిస్తామని అధికారులు చెబితే పట్టాలు పొందిన పేదలంతా దాదాపు నెలరోజులకుపైగా తుప్పలు కొట్టారు. పనిచేసిన కాలానికి కూలి డబ్బులు చెల్లించకపోయినా చేతికి భూమి వస్తుందన్న ఆశతో భూమంతా చదును చేశారు. కానీ ఈ నాటికీ పట్టాదారులెవరికీ ప్రభుత్వం భూమి అప్పగించలేదు. ఎవరి భూమి ఎక్కడవుందో లబ్ధిదారులెవరికీ తెలీదు. అయినా 142 మందికి ఇచ్చిన 102 ఎకరాల్లో దాదాపు 60 ఎకరాల్లో పేదలు మిగతా 2లో..

అవార్డు అందుకుంటున్న సునీల్ కుమార్

అత్యధిక లోడింగ్‌లో..

వాల్తేరు రైల్వేకు అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యధిక లోడింగ్ విభాగానికి సంబంధించిన అవార్డును వాల్తేరు రైల్వే డివిజన్ దక్కించుకుంది. ఈ మేరకు న్యూఢిల్లీలోని రైలు భవన్‌లో రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్ చేతుల మీదుగా వాల్తేరు డివిజన్ తరపున సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్ కుమార్ మంగళవారం ఈ అవార్డు అందుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాల్తేరు డివిజన్ ఇప్పటి వరకు 33.37 మిలియన్ టన్నుల లోడింగ్ సాధించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంలో లోడ్ చేయబడిన 30.24 మిలియన్ టన్నులతో పోలిస్తే ఇది 10.35 శాతం అధికం. పెరిగిన సరుకు రవాణా లోడింగ్ ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు నాటికి వాల్తేరు రైల్వే డివిజన్ రికార్డు స్థాయిలో మిగతా 2లో..

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి

▶ వార్త 2లో..

తోపుడు బండ్ల కార్మికుల ధర్నా

▶ వార్త 2లో..

జ్యూట్ కార్మిక వాడపై నిర్లక్ష్యం

▶ వార్త 3లో..

సినిమా వివరాలు వెల్లడిస్తున్న సత్యారెడ్డి, పల్సర్ బైక్ ఝూన్సీ

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం.. 'ఉక్కు సత్యాగ్రహం'లో ఆవిష్కృతం

నాలుగు భాషల్లో విడుదల - చిత్ర దర్శక, నిర్మాత, హీరో సత్యారెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం నేడు జరుగుతున్న పోరాటాన్ని 'ఉక్కు సత్యాగ్రహం' సినిమాలో ఆవిష్కరించినట్లు దర్శక, నిర్మాత, హీరో సత్యారెడ్డి వెల్లడించారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో సత్యారెడ్డి, పల్సర్ బైక్ ఝూన్సీ కలిసి నిర్మించిన 'ఉక్కు సత్యాగ్రహం' సినిమా విశేషాలను మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మిగతా 2లో..

'ఉక్కు'పై తాడో పేడో..

◆ నేటి నుంచి సిపిఎం ఆధ్వర్యాన ఉత్తరాంధ్రలో బైకుయాత్ర

◆ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభం

◆ భాగస్వామ్యంకానున్న ప్రజానీకం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు సిపిఎం పోరాటాన్ని ఉధృతం చేసింది. కేంద్రంలోని మోడీ సర్కారుతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమైంది. 950 రోజులుగా సాగుతున్న ఉక్కు పరిరక్షణ పోరాటానికి మరింత మద్దతు కోసం ఆ పార్టీ జనంలోకి చొచ్చుకువెళ్తోంది. బిజెపి కుట్రలను ఎండగట్టడం, ప్లాంట్‌ను పరిరక్షించడం లక్ష్యంగా ఈసారి బైకు యాత్రకు శ్రీకారం చుట్టింది. బుధవారం నుంచి ఈ యాత్ర ప్రారంభంకానుంది. అది ఉత్తరాంధ్ర అంతటా సాగి ఈ నెల 29న ఉక్కు నగరంలో ముగుస్తుంది. విశాఖపట్నంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న ఉక్కు దీక్షా శిబిరం నుంచి ప్రారంభమయ్యే ఈ బైకు యాత్రను బుధవారం ఉదయం 10.30 గంటలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభించనున్నారు. వామపక్ష మిగతా 2లో..

విశాఖలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

జయప్రదం చేయండి : ఎం.జగ్గునాయుడు

ఉక్కు రక్షణ బైకు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మంగళవారం పిలుపునిచ్చారు. ఈ యాత్ర ఎలా సాగుతుందో వివరించారు. 50 ద్విచక్ర వాహనాలు, వంద మందితో పది రోజులు పాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. విశాఖ జిల్లాలో ఉపజాతా 21న మద్దిలపాలెంలో ప్రారంభమై విశాఖ పార్లమెంట్ నియోజకవర్గమంతటా తిరిగి 26న ముగుస్తుందన్నారు. కేంద్రంలోని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రభుత్వ దగా..!

జీడితోటలు పెంచుకున్నారు. మిగిలిన వారంతా ఆనాటి నుంచి తమ భూమి ఇతరులపాలు కాకుండా కాపాడుకుంటూ వస్తున్నారు. గతంలో పేదలకు ఇచ్చిన డి పట్టా భూమిలో సెజ్ నిర్వాసితుల ఇళ్ల స్థలాల కోసం 30 ఎకరాలు తీసుకోవాలని ఎపిఐఐసి భావించింది. ఎకరాకు రూ.14 లక్షలు చొప్పున పరిహారం చెల్లించి భూమి తీసుకోవాలని నిర్ణయించింది. ప్రభుత్వం మారడంతో ఆ నిర్ణయం కార్యరూపం దాల్చలేదు. వైసిపి ప్రభుత్వం జగనన్న ఇళ్ల కాలనీ కోసం పేదల డి పట్టా భూమి పదెకరాలు తీసుకుంది. అయితే ఎకరాకు రూ.18 లక్షలు చెల్లిస్తామన్న నోటిమాట తప్ప భూములు కోల్పోయిన వారెవరికీ లిఖితపూర్వక హామీగానీ, భూమి తీసుకుంటున్నట్లు నోటీసుగానీ అధికారులు ఇవ్వలేదు. పదెకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం, ఆ భూమి హక్కుదారులైన డి పట్టాదారులకు ఇంతవరకూ పైసా పరిహారం చెల్లించలేదు. ఎప్పటిలోగా చెల్లిస్తారో కూడా అధికారులు చెప్పడంలేదని బాధితులు 'ప్రజాశక్తి' వద్ద వాపోయారు. పేదలకు పంపిణీ చేసిన డి పట్టా భూమిలో ఇళ్ల స్థలాలకు అనువుగావున్న భూమి తీసుకొని, పరిహారం ఇవ్వకుండా పేదలకు ప్రభుత్వం మొండిచేయి చూపడంపై పలువురు మండిపడుతున్నారు.

తక్షణమే పేదలకు పరిహారం చెల్లించాలి

జగనన్న కాలనీలో భూమి కోల్పోయిన పేదలకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి. ఇళ్ల స్థలాలకు భూమి ఇవ్వడానికి అభ్యంతరం చెప్పిన పేదలకు పరిహారం చెల్లిస్తామని నమ్మించి, ఇంతవరకు జమ చేయకపోవడం అన్యాయం. భూమి కోల్పోయిన పేదలకు పరిహారం చెల్లించడంతో పాటు డి పట్టాదారులకు హద్దులు నిర్ణయించి భూమి అప్పగించాలి. పరిహారం చెల్లింపులోనూ, భూమి అప్పగింతలోనూ జాప్యం చేస్తే పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేపడతాం.

ఆర్.రాము, సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్

ఒప్పందం అమలుచేయాలి

ఒప్పందం ప్రకారం పేదలకు పరిహారం చెల్లించాలి. డి పట్టాదారులకు న్యాయం చేయాలి. పరిహారం చెల్లిస్తామని చెప్పిన తరువాత కాలనీకి భూమి ఇవ్వడానికి అంగీకరించిన పేదలకు పరిహారం ఇవ్వకుండా తాత్సారం చేయడం సరికాదు.

కిల్లాడ బాబ్జీ, వెదురువాడ, సామాజిక కార్యకర్త

భూమీలేదు, పరిహారమూ అందలేదు

రాజశేఖరరెడ్డి హయాంలో 70 సెంట్లు భూమి ఇచ్చారు. ఇంతవరకు భూమి అప్పగించలేదు. జగనన్న కాలనీకి భూమి తీసుకుంటామన్నారు. తీసుకున్నదీ, లేనిదీ చెప్పలేదు. పరిహారం ఇంతవరకు ఇవ్వలేదు.

మైలపల్లి లక్ష్మి,
ఎస్‌సి కాలనీ, వెదురువాడ

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం.. 'ఉక్కు సత్యాగ్రహం'లో ఆవిష్కృతం

చిత్ర యూనిట్ తెలియజేసింది. తొలుత సత్యారెడ్డి మాట్లాడుతూ ప్రముఖ వాగ్గేయకారుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ నటించిన చివరి సినిమా ఇదేనన్నారు. ఇందులో ఆయన పాత్ర వీరోచితంగా ఉంటుందని తెలిపారు. ఆయన మూడు పాటలు రాయగా, సుద్దాల అశోక్ తేజ రెండు పాటలు రాసారని వెల్లడించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న పోరాటాన్ని ఈ సినిమాలో తెరకెక్కించామన్నారు. తెలుగు, కన్నడ, తమిళం, హిందీ భాషల్లో విడుదలవుతుందని తెలిపారు. త్వరలోనే ఆర్‌కె బీచ్‌లో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో కొద్ది రోజుల్లో టీజర్, ట్రైలర్ విడుదల అవుతుందన్నారు. ఈ సినిమాలో విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నటించారన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ 900 రోజులుగా కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని సత్యారెడ్డి సినిమాగా తీయడం అభినందనీయమన్నారు. స్టీల్‌ప్లాంట్ విశాఖ జీవనాడి అని, స్టీల్‌ప్లాంట్ కోసం ఆనాడు జరిగిన పోరాటం దేశంలోనే గుర్తింపు పొందిందని అన్నారు. నేడు స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ సాగుతున్న చైతన్యవంతమైన పోరాటానికి మద్దతుగా ఉక్కు సత్యాగ్రహం సినిమా నిర్మాణం కావడం గర్వించదగిన విషయమన్నారు. పల్సర్ బైక్ ఝాన్సీ మాట్లాడుతూ జరుగుతున్న కథతో తీసిన సినిమాలో నటించడం ఆనందంగా ఉందన్నారు. గద్దర్ నటించిన సినిమాలో పాత్ర పోషించడం సంతోషంగా ఉందని తెలిపారు. మీడియా సమావేశంలో చిత్ర నటుడు ప్రసన్న కుమార్, రమేష్ పాల్గొన్నారు.

అత్యధిక లోడింగ్‌లో.. వాల్తేరు రైల్వేకు అవార్డు

రూ.3653 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది, గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ఆర్జించిన మొత్తం రూ.3103 కోట్లు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ వాల్తేర్ డివిజన్ బృందానికి, ముఖ్యంగా ఆపరేషన్స్ టీమ్‌కు అభినందనలు తెలియజేశారు. కొత్త రికార్డు నెలకొల్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు వాల్తేరు డివిజన్ సిబ్బంది అంకితభావానికి నిదర్శనమన్నారు. మున్ముందు మరింత ప్రగతి సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

తోపుడు బండ్లు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జూ పార్కు నుంచి పిఎం.పాలెం స్టేడియం వరకు ఉన్న 40 తోపుడు బండ్లను అటవీశాఖ అధికారులు తొలగించాలని చూడటం అన్యాయమంటూ మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం, సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ 25 సంవత్సరాల నుంచి తోపుడుబండ్లు, చిన్న చిన్న బడ్డీలు పెట్టుకుని చిల్లర వర్తక కార్మికులుగా 40 కుటుంబాల వారు బతుకుతున్నారన్నారు. తాజాగా అటవీశాఖ అధికారుల దాడులతో వీరి కుటుంబాలు రోడ్డుపాలు అవుతున్నాయన్నారు. తోపుడు బండ్లు కార్మికులకు బతికే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. నేషనల్ స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం రోడ్డు పక్కన బతికే చిల్లర వర్తకులు, కార్మికులకు రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. ఆ విషయాన్ని గుర్తించి హాకర్ జోన్స్ ఏర్పాటు చేయాలన్నారు. జూపార్కు రోడ్డులో ఉన్న తోపుడు బండ్లను తొలగిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జూ పార్కు తోపుడు బండ్లు కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కిరణ్ కుమార్, ఎస్.లక్ష్మణ్, నాయకులు ఎన్.ధనుంజయరావు, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న తోపుడు బండ్లు కార్మికులు

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశంలో ప్రాంతాలు, రాష్ట్రాల వారీగా ప్రజల మధ్య మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు చేస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి అన్నారు. మంగళవారం ఆర్.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఇండియా కూటమి ఏర్పాటుతో బిజెపి నాయకత్వంలో వణుకు ప్రారంభమైందని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఇండియా పేరును భారత్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్నారన్నారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే కూటమి ప్రధాన లక్ష్యమని అన్నారు. బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ వ్యక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఇటీవల జరిగిన జి 20 సమావేశాలతో మోడీ తన వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకోవాలని చూసినా అదేమీ జరగలేదని పేర్కొంటూ ఇటీవల జరిగిన పరిణామాలను వివరించారు. ఇటీవల రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ప్రేరేపితంతోనే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిందన్నారు. కేంద్రం సహాయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరోజు కూడా మనుగడ సాగించలేదని అన్నారు.

తాపీ ధర్మారావు జయంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగం సంగీత, నృత్య శాఖలు, సమైక్య భారతి, విశాఖ రచయితల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని పురస్కరించుకొని తాపీ ధర్మారావు జయంతి వేడుకలను ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసెంబ్లీ హాలులో బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎయు తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఐఎఎస్ఇ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ శాఖాధ్యక్షులు ఆచార్య జాలాది రవి, సంగీత నృత్య విభాగాధిపతి అనురాధ, తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆర్‌కె బీచ్‌లో కోస్టల్ క్లీనప్ డే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ కోస్ట్‌గార్డ్, హైదరాబాద్‌కి చెందిన బయోప్లాస్టిక్స్ తయారీ సంస్థ ఎకోలాస్టిక్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ డేను పురస్కరించుకుని తీర ప్రాంత శుభ్రతా చర్యలు చేపట్టారు. బీచ్ క్లీనప్ డ్రైవ్‌ను మూడు నగరాల్లో ఒకేసారి అమలు చేసినట్టు కోస్ట్‌గార్డ్ అధికారి ఎం.మధు, ఎకోలాస్టిక్ సంస్థ అధినేత జితేంద్ర తెలిపారు.

'ఉక్కు'పై తాడో పేడో..

(మొదటి పేజీ తరువాయి..) పార్టీల నాయకులు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ప్రముఖులు, కవులు, కళాకారులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ నెల 29న సాయంత్రం 4 గంటలకు ఉక్కు నగరంలోని త్రిష్టా గ్రౌండ్‌లో ఈ యాత్ర ముగింపు సభ జరుగనుంది. సిపిఎం జాతీయ నాయకులు, రాష్ట్రంలోని ప్రముఖులు ఈ సభలో మాట్లాడనున్నారు. బైకు యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కొత్తపల్లి లోకనాథం నాయకత్వం వహిస్తారు. ఆరు జిల్లాల్లో పర్యటించే ఈ యాత్ర సుమారు 1200 కిలోమీటర్లు సాగుతుంది. వేలాది మంది పాల్గొననున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఉక్కు రక్షణ బైకుయాత్రను, సభను జయప్రదం చేయాలంటూ మంగళవారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పలుచోట్ల పోస్టర్లను సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు.

కొనసాగిన దీక్షలు

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను భేషరతుగా నిలుపుదల చేయాలని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 899వ రోజుకు చేరాయి.

దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్ర జిల్లాల జీవనాడి అన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపి.చంద్రమౌళి, కె.నర్సింగరావు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి : ఎం.జగ్గునాయుడు

(మొదటి పేజీ తరువాయి..) బిజెపి ప్రభుత్వానికి స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని పదే పదే ప్రకటనలు చేయడం రివాజుగా మారిందన్నారు. రాష్ట్రంలో ఉండే అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు ఆ వ్యాఖ్యలను ఏమాత్రమూ ఖండించడం లేదన్నారు. ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతున్నామని ఒక పక్క చెబుతూనే మరోవైపు బిజెపిని నెత్తినపెట్టుకుంటున్నాయన్నారు. ప్లాంట్ ఏర్పాటు దగ్గర నుంచి నేటి వరకూ సిపిఎం ఉద్యమిస్తోందని, ఎలాగైనా ప్లాంట్‌ను రక్షించుకుంటామని తెలిపారు. ఉక్కు పోరాటాన్ని.. ప్రజా పోరాటంగా మలచడం కోసమే ఈ యాత్ర సాగుతుందన్నారు. ఈ యాత్రలో ప్రజలు, కార్మికులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P.32/2023

Between :
Bantubilli Rama Krishna,
S/o. Krishna (Late), Hindu,
age 40 years,
R/at. D.No. 55-1-15/1/1,
Old Venkoji Palem,
H.B. Colony,
Visakhapatnam. ...Petitioner
And:
Kolnati Raju & 25 others
...Respondents

GENERAL NOTICE

The public are hereby informed that the above petitioner filed the above I.P., to declare him as an insolvent and the matter stands posted to **05-10-2023** for hearing. So the public are hereby informed that anybody have any objections can be raised in the above case and appear before the Hon'ble Court on the said date either in person or through an Advocate at **10:30 A.M.**, as other wise the matter will be proceed further.

J. JAGADEESH
Advocate,
Visakhapatnam.

జ్యూట్ కార్మిక వాడపై నిర్లక్ష్యం

▶▶ క్వార్టర్లలో కుటుంబాలు లేవన్న కారణంతో పట్టని పారిశుధ్యం
▶▶ కాల్వల్లో నిల్వ ఉన్న మురుగునీరు
▶▶ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి -తగరపువలస

పాలకుల పుణ్యమా అని ఎంతో పేరెన్నికగన్న చిట్టివలస జ్యూట్ మిల్లు 2009 ఏప్రిల్ 20న శాశ్వతంగా మూత పడడంతో మిల్లులో పనిచేసిన జ్యూట్ కార్మికులు ఉపాధి కోసం నగరంలో ఉన్న పలు ప్రైవేట్ సంస్థల్లో సెక్యూరిటీ గార్డులుగా, గుమస్తాలుగా, కార్మికులుగా పనిచేస్తున్నారు.

అంతులేని నిర్లక్ష్యం

మిల్లు తిరిగేటప్పుడే జ్యూట్ కార్మిక వాడ నిర్లక్ష్యానికి గురైంది. అటు యాజమాన్యం గానీ, ఇటు మునిసిపాలిటీ గానీ పట్టించుకునే పరిస్థితి ఉండేది కాదు. కార్మిక సంఘాలు ఒత్తిడి చేస్తే అరకొరగా సదుపాయాలు కల్పించేవారు. ఇప్పుడేమో మిల్లు మూతపడి సుమారు 14 ఏళ్లు దాటింది. దీంతో కార్మికవాడ తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. మిల్లు తిరిగే సమయంలో ఇక్కడి క్వార్టర్లలో దాదాపు 500 కార్మిక కుటుంబాలు ఉండేవి. యాజమాన్యం వివిధ రకాల చెల్లింపులు చేయడంతో సుమారు 300 మంది క్వార్టర్లు ఖాళీ చేశారు. శిథిలావస్థకు చేరిన క్వార్టర్లలోనే ప్రస్తుతం సుమారు 200 మంది ఉండొచ్చని అంచనా. కార్మికులు, వారి కుటుంబాలు ఎంత మంది ఉన్నారన్నది ఇక్కడ ప్రశ్న కాదు, ఉన్న కొద్దిమందికైనా కనీస సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత జివిఎంసి అధికారులదే.

క్షీణించిన పారిశుధ్యం

కార్మికవాడలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. ఎక్కడికక్కడే పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. శిథిల క్వార్టర్ల గోడలు, పైకప్పులు పడి ఉన్నాయి. రాత్రివేళలోనే కాదు పగలు అటుగా వెళ్లాలంటే స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ పాము, పుట్ర, విష కీటకాలు బెడద ఉందని క్వార్టర్లలో ఉన్న వారు వాపోతున్నారు. కార్మికులు లేరన్న కారణంతో పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేసిన ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడితే బాధ్యత వహించేది ఎవరని కార్మికులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

జ్యూట్ కార్మికవాడలో శిథిలమైన ఇళ్లు

జ్యూట్ కార్మిక వాడలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలి

కార్మికవాడలో పారిశుధ్య నిర్వహణపై తక్షణమే జివిఎంసి అధికారులు దృష్టి పెట్టాలి. అసలే వర్షాకాలం కావడంతో కాల్వల్లో ఉన్న మురుగు నీరు నిల్వ ఉండి దోమలు రాత్రి వేళ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎటుచూసినా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. క్వార్టర్లలో ఉన్న వారు, సమీపాన ఉన్న కుటుంబాలు రోగాల బారిన పడితే ఎవరు బాధ్యులు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత జివిఎంసి అధికారులపై ఉంది.

రవ్వ నరసింగరావు
ప్రధాన కార్యదర్శి
సిజెఎం, మెకానికల్ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -పాయకరావుపేట : మండలం ఆరట్లకోట గ్రామానికి చెందిన వేముల నరేంద్ర (18) గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ జోగారావు తెలిపారు. పోలీసుల కథనమేరకు, ఈ నెల 13న తన స్నేహితులతో కలిసి తిరుపతి వెళ్లిన నరేంద్ర, 16న ఇంటికి తిరిగొచ్చాడు .అయితే తిరుపతి వెళ్లి గుండు గీయించుకోలేదెందుకని తండ్రి వేముల వెంకటరావు మందలించడంతో మనస్తాపానికి గురై, సోమవారం గడ్డి మందు తాగి, అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జోగారావు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: మండలంలోని కొరుప్రోలు గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మరణించాడు. దీంతో గ్రామస్థులు ఆగ్రహించి ఆందోళన చేపట్టారు. వివరాలివి. సోమవారం సాయంత్రం కొరుప్రోలు గ్రామానికి చెందిన వేగేసిన సత్యన్నారాయణరాజు తన ఇంటి వద్ద నున్న అరటి చెట్లను తొలగిస్తుండగా, నక్కపల్లి హెటిరో పరిశ్రమకు వెళుతున్న హైటెన్షన్ విద్యుత్ లైనుకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో అడ్డురోడ్డు, రేవుపోలవరం రోడ్డులో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయమేర్పడింది. ఈ విద్యుత్ లైను వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అటు హెటిరో యాజమాన్యంగానీ, ఇటు విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. హై టెన్షన్ లైను ఎత్తు పెంచాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు హైవే జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం చెందాడు. మాకవరపాలేనికి చెందిన బొడ్డు సతీష్ బైక్‌పై వస్తుండగా చినదొడ్డిగల్లు హైవే జంక్షన్ వద్ద అదే మార్గం గుండా వచ్చే లారీ ఢీకొంది. దీంతో సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో అన్నవరం గ్రామానికి చెందిన కరణం శ్రీనివాస్ (29) గడిచిన 15 రోజులుగా కనిపించలేదని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు స్థానిక ఎస్ఐ నారాయణరావు తెలిపారు. టెంట్‌హౌస్ షాపులో పనిచేస్తున్న శ్రీనివాస్, అదృశ్యమైనప్పుడు లైట్ బ్లూ కలర్ షర్టు, జీన్ ప్యాంటు వేసుకున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషనుకు సమాచారమివ్వాలని కోరారు.

చెరువులో జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి -గాజువాక : చెరువులో జారిపడి మహిళ మృతి చెందిన ఘటన రెడ్డి తుంగ్లాంలో మంగళవారం చోటు చేసుకుంది. రెడ్డి తుంగ్లాం గ్రామానికి చెందిన ఎస్.నాగమణి (58) మంగళవారం ఉదయం వినాయక చవితి పూజా సామాగ్రి చెరువులో కలుపుదామని వెళ్లి కాలుజారిపడి నీటిలో పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో ఆమె మృతి చెందింది. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ పటిష్టతకు కృషి : కోలా

ప్రజాశక్తి -మధురవాడ : ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీని పటిష్టం చేసేందుకు కృషిచేయాలని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు కోరారు. ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలా గురువులు మాట్లాడుతూ, జిల్లా, నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల కమిటీలను సమన్వయం చేస్తూ పనిచేయాలని సూచించారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.రవిరెడ్డి, దామా సుబ్బారావు, ఆళ్ల శివగణేష్, ఆడ్డాల కృపాజ్యోతి, మాన్యాల శ్రీనివాస్, బోని శివరామకృష్ణ, పెంద్ర అప్పన్న పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -తగరపువలస : చదువుతో పాటు వ్యవసాయంపై అవగాహన అవసరమని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) ఏనాడో పేర్కొన్నట్లు గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తెలిపారు. స్థానిక కెజిబివిలో మంగళవారం విద్యాలయం ఆవరణలో విద్యార్థినిలు కూరగాయల విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా సంబంధిత కార్యక్రమాలతో వ్యవసాయ, పోషకాహార పంటల సాగుపై అవగాహన కలిగి ఉండడం ద్వారా విద్యార్థుల్లో మనో వికాసం కలుగుతుందని, సృజనాత్మకత పెరుగుతుందని పేర్కొన్నారు. గత ఏడేళ్లుగా జివిఎంసి రాయిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రకృతి ఆధారంగా వ్యవసాయం సాగుచేస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రిన్సిపల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విమ్స్‌లో వైద్యుల పోస్టులకు రేపు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్) ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న 43 సూపర్ స్పెషలిస్టు, జనరల్ స్పెషలిస్టు వైద్యుల పోస్టులకు ఈ నెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూపర్ స్పెషలిస్టు వైద్యులకు నెలకు రూ.1.60 లక్షలు, జనరల్ వైద్యులకు రూ.92వేలు జీతం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వైద్యులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. గురువారం ఉదయం 9 నుంచవ 2 గంటల వరకు ఇంటర్వ్యూలు ఆసుపత్రి పరిపాలన భవనంలో ఏపి మెడికల్ బోర్డు మంగళగిరి అధికారుల పర్యవేక్షణలో ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులంతా ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శిగా శంకరరావు

ప్రజాశక్తి -తగరపువలస : ఉమ్మడి విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సహాయ కార్యదర్శిగా చిట్టివలసకు చెందిన మాకాల శంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో మంగళవారం జిల్లా స్థాయి అసోసియేషన్ ఎన్నిక జరిగింది. ఉమ్మడి జిల్లాల నుంచి 20 మండలాలకు చెందిన అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. సహాయ కార్యదర్శిగా మాకాల శంకరరావు ఎన్నికవ్వగా, అధ్యక్షులుగా పెందుర్తి మండలానికి చెందిన ప్రభూజీ, ప్రధాన కార్యదర్శిగా గొంప నరసింహనాయుడు, కోశాధికారిగా డి.సుబ్బారావు ఎన్నికయ్యారు. ఎపి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు, శాప్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారని సహాయ కార్యదర్శి శంకరరావు తెలిపారు. శంకరరావు భీమిలి మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

మహిళా మార్ట్ పరిశీలన

ప్రజాశక్తి- పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్మిస్తున్న మహిళా మార్ట్ నిర్మాణ పనులను మంగళవారం ఎంపిపి రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ఇప్పటివరకు 50 శాతం పనులు పూర్తయినట్లు చెప్పారు. సరసమైన ధరల్లో నిత్యావసరాలను విక్రయించేందుకు మండలంలోని 14900 మంది మహిళా సంఘాల సభ్యుల నుంచి నిధులు వసూలు చేసి మహిళా మార్ట్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ప్రభాకర్, మహిళా మార్ట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ పనులను పరిశీలిస్తున్న ఎంపిపి రాంబాబు

చంద్రబాబు తప్పించుకోలేడు : అమర్‌నాథ్

ప్రజాశక్తి-సీతమ్మధార : తప్పుచేసిన చంద్రబాబు చట్టం నుంచి తప్పించుకోలేడని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పష్టంచేశారు. తప్పు చేశాడు కాబట్టే న్యాయస్థానాలు ఆయనను జైలుకు పంపించాయని పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సీతమ్మధారలో ఏర్పాటుచేసిన గణపతిని మంగళవారం మంత్రి అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు జైలు నుంచి విడుదల కావాలని పలు రాష్ట్రాలు, దేశాలలో పూజలు, ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు ప్రజల కోసం త్యాగాలు చేయలేదని, రాష్ట్ర ఖజానాలోని రూ.371 కోట్లు కొట్టేసిన దొంగ అని వ్యాఖ్యానించారు. లోకేష్ ఢిల్లీ, అమెరికా వెళ్లి ఆందోళన చేసినా చంద్రబాబు చట్టం నుంచి తప్పించుకోలేడన్నారు.

పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోనూ విద్యార్థుల హక్కుల పరిరక్షణ, సంక్షేమంలో భాగంగా ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్సిపిసిఆర్) సభ్యుడు గొండు సీతారాం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనలు మేరకు ద్వారకానగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాల ప్రాంగణంలో మంగళవారం విద్యార్థుల ఫిర్యాదుల బాక్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కూల్ యాజమాన్యం, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు సంయుక్తంగా ప్రతి ఫిర్యాదునూ నిశితంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కార మార్గాలను చూపాలన్నారు. బాలల హక్కులకు ఉల్లంఘనలు జరిగితే చర్యలకు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని స్పష్టంచేశారు. సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి రామారావు మాట్లాడుతూ, అన్ని పాఠశాలల్లో విద్యార్థుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రవీంద్ర భారతి పాఠశాల చీఫ్ జనరల్ మేనేజర్ జి.వసంత మాట్లాడుతూ, జిల్లాలోని తమ పాఠశాలలన్నింటిలో ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణాధికారి రమేష్, అర్బన్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీలత, సిఆర్‌ఎం టి.రాధ, వార్డు సచివాలయ అడ్మిన్ భవ్యశ్రీ, స్కూల్ ఎజిఎం జివిఎస్.మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పలుచోట్ల గడపగడపకు...

ప్రజాశక్తి-సీతమ్మధార, తగరపువలస : జివిఎంసి 14వ వార్డు పరిధి సీతమ్మధార, ఎస్ఆర్.నగర్, క్షత్రియ కల్యాణ మండపం ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరిగేలా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. మౌలిక వసతులను కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, 45వ వార్డు అధ్యక్షులు పైడి రమణ, రాయుడు శ్రీను, నూకరాజు, సత్యనారాయణ, ప్రవీణ్ వర్మ, లింగేశ్వరరావు, బోగవల్లి గోవింద్, షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ పరిధిలో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోని జగ్గమ్మ, ఎంపిపి దంతులూరి వాసు రాజు, జెడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, ఉప సర్పంచ్ బుద్ధరాజు సత్య నారాయణరాజు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎండిఒ పి.వెంకటరమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రేఖ, హౌసింగ్ ఎఇ హుస్సేన్, వైఎస్సార్ క్రాంతి పథం ఎపిఎం బి.రంగారావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ విఆర్ఒ పి.వెంకటప్పారావు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రామాలయంలో సీసీ కెమెరాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : బాలగణపతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన అగనంపూడి పునరావాసకాలనీ అండమాన్ కొండయ్యవలస రామాలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను సిఐ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, దొంగతనాలు అరికట్టాలనే ఉద్దేశంతో దేవాలయాలు, అపార్ట్‌మెంట్లు, పెద్ద షాపులు, కాలేజీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు సిఐ శ్రీనివాసరావుకు ఇటీవల ఉత్కృష్ట సేవా పతకం ప్రకటించినందుకు ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, జనని సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విందుల వెంకటరమణ, బాల గణపతి కల్చర్ అసోసియేషన్ యూత్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెల్లి శ్రీనివాసరావు, తోకడ రాము, దానబాల పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

స్టీల్‌ప్లాంట్‌లో సమావేశమైన అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకై సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 20వ తేదీన చేపట్టే ఉత్తరాంధ్ర జిల్లాల బైక్ యాత్రను, ఈ నెల 29న నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ పలుచోట్ల మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు.

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లోని సిఐటియు కార్యాలయంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ముందుగా బైక్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు ఉపాధ్యక్షులు టివికె.రాజు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రజా చైతన్యం కలిగించేందుకు ఈ బైక్ యాత్ర చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు జ్యోతిప్రసాద్, కనకరాజు, రమణాజి, భాస్కరరావు, రామారావు, కొమ్ము ప్రసాద్, సుబ్బారావు, జగన్, రామ్‌కుమార్, ఆర్.రాజబాబు, కొల్లి నాగేశ్వరరావు నాయుడు, ఎస్‌కెకె.మొహిద్దిన్, పి.శ్రీనివాస్, హనుమంతరావు, పుల్లారావు, కె.ఆనంద్‌కుమార్, కన్నబాబు, బంద్యోపాధ్యాయ పాల్గొన్నారు.

మధురవాడ : సిపిఎం మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యాన కొమ్మాదిలోని సిఐటియు కార్యాలయం వద్ద పోస్టర్‌ను విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, నాయకులు పి.రాజుకుమార్, డి.కొండమ్మ, టికె.శారద, బి.భారతి పాల్గొన్నారు.

గాజువాక : సిపిఎం గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యాన గాజువాక సిపిఎం కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు లోకేష్, డి.రమణ పాల్గొన్నారు.

గాజువాక సిపిఎం కార్యాలయంలో రాంబాబు తదితరులు

ఎస్ రాయవరం : ఉక్కు రక్షణ ఉత్తరాంధ్ర బైక్‌యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఎం. సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం వేమగిరిలో బైక్‌యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుమారి, శాంతి, పెంటయ్య, లక్ష్మి, జయమ్మ, నూరిబాబు, రమణ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఉక్కు రక్షణ బైక్ యాత్ర పోస్టర్‌ను భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగ్ హోటల్ జంక్షన్ వద్ద యూనియన్ అధ్యక్షులు కె.నర్సింగరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, భవన నిర్మాణ కార్మికులు సింగనాయుడు, గణ, రామారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొమ్మాది సిఐటియు కార్యాలయంలో...

దేవరాపల్లి : ఉత్తరాంధ్ర బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, వి.మాడుగుల మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికుల పోరాటానికి రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా విశాలమైన మద్దతు లభిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పి.బన్ను, సన్నిబాబు, సూర్యనారాయణ, దేముళ్లు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రంలో ఉత్తరాంధ్ర బైక్ ర్యాలీ పోస్టర్‌ను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ బైక్ యాత్ర ద్వారా బిజెపి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వల్ల రాష్ట్రానికి జరుగు నష్టం గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్.శివాజీ, ఎం.శ్రీనివాసరావు, కార్మికులు ఎం.చిన్నా, అప్పారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో....

ఎస్.రాయవరంలో...

బేవరేజెస్ కళాశీల ధర్నా

ప్రజాశక్తి-వేపగుంట : దిగుమతి కూలిరేట్లు ఒప్పందంపై డిస్టలరీ యాజమాన్యాలు సంతకాలు చేయాలని, ఒప్పందం ప్రకారం ఈ ఏడాది మే 2 నుంచి జూన్ 5వ తేదీ వరకు ఎరియర్స్ చెల్లించాలని, కళాశీలందరికీ ప్రమాద బీమా చేయించాలని డిమాండ్‌చేస్తూ జెర్రిపోతులపాలెంలోని ఆంధ్రప్రదేశ్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌బిసిఎల్) డిపో ముందు ఆ కళాశీలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను డిపో అధ్యక్షులు బి.వెంకటరావు ప్రారంభించి మాట్లాడారు. డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ నెల 20వ తేదీ నుంచి దిగుమతులు ఆపేస్తామని హెచ్చరించారు. ఒప్పందంలో అంగీకరించిన కాపీలు ఇవ్వకపోవడం సరైన చర్యకాదని విమర్శించారు. ఈ ధర్నాలో లోడింగ్, అన్‌లోడింగ్ కళాశీల నాయకులు ఎం.శ్రీనివాసరావు, వై.వెంకటరమణ, ఎం.వరహాలు, టి.వెంకటరావు పాల్గొన్నారు.

జెర్రిపోతులపాలెంలోని డిపో ముందు ధర్నా చేస్తున్న కళాశీలు

నోటరీ అడ్వకేట్‌లకు జియో మ్యాపింగ్

ప్రజాశక్తి-లీగల్ : విశాఖపట్నం జిల్లాలో ప్రాక్టీస్ చేస్తున్న నోటరీ అడ్వకేట్లందరిని వారి ప్రాంతాలను బట్టి జియో మ్యాపింగ్ చేయనున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి బాలకృష్ణ తెలిపారు. జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో నోటరీ అడ్వకేట్‌లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. జియో మ్యాపింగ్ ప్రధానుద్దేశాన్ని వివరించారు. ప్రతి సచివాలయంలోనూ లబ్దిదారులకు కావలసిన నోటరీ అఫిడవిట్లను వారంలో రెండు రోజులు ఆయా ప్రాంతాలకు చెందిన నోటరీ అడ్వకేట్స్ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండి నోటరీ చేసి ఇవ్వాలని చెప్పారు. జిల్లా రిజిస్టర్ పూర్ణిమదేవి మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద 607 సచివాలయాలు, ఒక్క అర్బన్‌లోనే 545 ఉన్నట్లు తెలిపారు. ఆయా సచివాలయాల్లో డోర్ స్టెప్ సర్వీస్ కింద సేవలందివ్వాలని ప్రభుత్వ ఆలోచన ఉందన్నారు. సచివాలయాల్లో అందిస్తున్న 541 రకాల సర్వీసులకు సేవలు చేయుటకు ఈ మ్యాపింగ్ చేస్తున్నట్లు చెప్పారు. నోటరీ సర్వీస్ అడ్వకేట్స్ అందరూ సేవలందివ్వాలని విజ్ఞప్తి చేశారు.

80 అడుగుల రోడ్డు విస్తరణకు ప్రణాళిక

ప్రజాశక్తి- గోపాలపట్నం : ఎన్ఎస్‌టిఎల్ రోడ్డు వంటిళ్ల హోటల్ నుంచి కుమారి ఫంక్షన్ హాలు వరకు 80 అడుగుల రోడ్డు విస్తరణకు ప్లాన్‌తో పాటు మార్కింగ్ చేపట్టాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. ఎన్ఎస్‌టిఎల్ రోడ్డు వంటిళ్ల హోటల్ నుంచి కుమారి ఫంక్షన్ హాలుకు వెళ్లే మార్గాన్ని, రత్నగిరి కాలనీ, చిన్నముషిడివాడ, సుజాతనగర్ తదితర ప్రాంతాలలో మంగళవారం ఆయన పర్యటించారు. రత్నగిరి కాలనీ వద్ద ఉన్న థీం పార్క్‌ను సందర్శించి పార్కులో వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, లైటింగ్, తాగునీరు, వాచ్ మేన్ గది, మరుగుదొడ్లు, ఆఫీసు రూమ్ తదితరాలను ఈ నెలాఖరుకు పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. చిన్నముషిడివాడ, సుజాతనగర్ పరిసరాలలో పారిశుధ్యం సరిగా లేదని, వెంటనే యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ రాజ్మోహన్‌రావు, కార్యనిర్వాహక ఇంజినీరు రమణమూర్తి, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు విజయ్‌కుమార్, డిసిపి పద్మజ, ఎసిపి జయరాం తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని

బిసి హాస్టల్ విద్యార్థినుల ఆందోళన

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని అన్నవరం బిసి బాలికల వసతి గృహం నుండి కొత్తూరు జంక్షన్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన ఆ హాస్టల్ విద్యార్థినులు మంగళవారం స్థానిక కొత్తూరు జంక్షన్‌లో ఆందోళన చేపట్టారు. మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మామిడి రమణ, ఎస్.రమణ మాట్లాడుతూ ఈ హాస్టల్‌లో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న సుమారు 130 మంది విద్యార్థినులు వసతి సౌకర్యం పొందుతున్నారని తెలిపారు. వీరంతా సుమారు 2 కిలోమీటర్లకు పైగా దూరం ఉన్న చోడవరం పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌కు రోజూ నడుచుకుంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరు పుస్తకాలు, బ్యాగులు మోస్తూ సుమారు 5 కిలోమీటర్ల దూరం రోజూ నడవాల్సి వస్తోందన్నారు. సాయంత్రం సమయంలో ఈ దారిలో ఆకతాయిలు బెడద ఎక్కువగా ఉందని, మద్యం షాపులు, బార్‌లు వంటివి ఉండడంతో విద్యార్థినులను ఆకతాయిల వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సుమారు 40 మంది పిల్లలు టిసిలు తీసుకుని హాస్టల్ నుండి వెళ్లిపోయారని పేర్కొన్నారు. గతంలో బస్సు సౌకర్యం ఉండేదని, కరోనా తర్వాత బస్సు రాకపోకలను నిలిపివేశారని తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని బడి బస్సును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు డివైఎఫ్ఐ నాయకులు ఎస్‌వి.నాయుడు, సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, జి.వరలక్ష్మి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కామేష్, రమేష్, సుందర్, గాయత్రి, బి.మాధురీలత, వర్శిని, వెంకటలక్ష్మి, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మానవహారం చేస్తున్న విద్యార్థినులు

స్థల పరిశీలన చేస్తున్న జెసి జాహ్నవి, ఆర్‌డిఒ తదితరులు

అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని పూడిమడకలో జెట్టి నిర్మాణంలో భాగంగా అప్రోచ్ రోడ్డు వేయటానికి మంగళవారం ప్రతిపాదిత స్థలాన్ని జాయింట్ కలెక్టర్ జాహ్నవి పరిశీలించారు. ఉప్పు గల్లీలు నుంచి ప్రారంభమై ప్రతిపాదిత జెట్టీ నిర్మాణ ప్రదేశం వరకు రోడ్డు నిర్మించనున్నారు.కిందిస్థాయి ప్రతిపాదించిన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ జాహ్నవి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ తహశీల్దారు శ్రీనివాసరావు, కోస్టల్ రెగ్యులేటరీ సలహా బోర్డు నెంబర్ చేపల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సోమశేఖర్

నెలాఖరుకు ఈ-క్రాప్ నమోదు పూర్తి

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఈ నెల 30వ తేదీ లోగా రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. మండలంలోని రొంగలి నాయుడుపాలెం, మేడిచర్ల గ్రామాల్లో మంగళవారం ఆయన రైతులతో మాట్లాడారు. ఇప్పటివరకు ఈ క్రాప్ నమోదు చేసుకోలేని రైతులకు ఎటువంటి వ్యవసాయ పథకాలు అందని తెలిపారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు, సున్నా వడ్డీ పంట రుణాలకు ఈ క్రాప్ అర్హతగా గుర్తిస్తారని తెలిపారు. దూర ప్రాంతంలో ఉంటూ ఇక్కడ పంటలు పండించే రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ చేసుకుని ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 1865 హెక్టార్లలో వరి నాట్లు పడ్డాయని, ఇందులో 1011 హెక్టార్లకు పంట నమోదు పూర్తయిందని తెలిపారు. మిగిలిన రైతులు ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

దక్షిణ భారత కరాటే పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి- అనకావల్లి

దక్షిణ భారత కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు పతకాలు సాధించింది. 12 మంది గల ఆంధ్ర జట్టులో ఏడుగురు అనకాపల్లి పట్టణానికి చెందినవారు కావడం విశేషం. ఈ నెల 9, 10 తేదీల్లో కేరళ రాష్ట్రం తిరువనంతపురంలోని వెల్లాయంబళం జిమ్మీ జార్జ్ స్పోర్ట్స్ హబ్‌లో జరిగిన 2వ సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో అనకాపల్లికి చెందిన కరాటే కోచ్ కాకర శివ సారధ్యంలో మన రాష్ట్ర జట్టు తరపున ఏడుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వారు ఒక బంగారు, ఆరు కాంస్య పతకాలు సాధించారు. వీరంతా గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని ఆంధ్ర జట్టుకు ఎంపికయ్యారు. దక్షిణ భారత కరాటే ఛాంపియన్ షిప్లో పాల్గొన్న తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన జట్లతో తలపడి మన జట్టు మంచి ప్రతిభ చూపించారు. వి.ఇంద్రకుమార్ బంగారు పతకం, ఎన్. దివ్యశ్రీ, కె. రేవతి, వై.మోహన్ శ్రీను, పి.నిఖిల్, ఎ. సిరివర్షిణి, వి.భవాని కాంస్య కంచు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటైన అభినందన కార్యక్రమంలో అనకాపల్లి వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు మంచి క్రీడాకారులుగా ఎదిగేందుకు రోజూ సాధన చేయాలని సూచించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న వైసిపి నేత దాడి రత్నాకర్

డిప్యూటీ సిఎం బూడి సమక్షంలో చేరిన దృశ్యం

టిడిపి నుంచి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలోని టిడిపికి చెందిన 30 కుటుంబాల వారు ఆ గ్రామ సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు సమక్షంలో వైసీపీలో మంగళవారం చేరారు. వారికి తారువలోని తన క్యాంపు కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని, ఏ సమస్య వచ్చినా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. వైసిపిలో చేరిన రెడ్డి నారాయణమూర్తి, కరక దొంగబాబు, కొటన రాజబాబు, అచ్చిబాబు, బూరె అప్పారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా టిడిపిలో ఉన్న తమ సమస్యలను ఆ పార్టీ నాయకత్వం పట్టించుకోలేదని, కాని ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలతో పాటు, మౌలిక వసతులు కల్పిస్తున్న బూడి ముత్యాలనాయుడు నాయకత్వంపై తమకు ఎనలేని నమ్మకం ఉందని తెలిపారు. ఇకపై గ్రామంలో ఒకే పార్టీ ఒకే నినాదంతో కొనసాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, గ్రామ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టరూ..

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - పరవాడ

గుంతలు పడ్డ రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక సినిమా హాల్ జంక్షన్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సినిమా హాల్ జంక్షన్ వద్ద మెయిన్ రోడ్డులో భారీ గుంతలు ఏర్పడినా ఆర్ అండ్ బి అధికారులుగాని, పాలకులు గాని పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. భారీ ఎత్తున గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రయాణికులు తీవ్ర గాయాలు పాలవుతున్నారని, అనేక వాహనాలు ఈ గోతిలోపడి మరమ్మతులకు గురవుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారీ ఎత్తున ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.నాయుడు, పైడికొండ, శ్రీను, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

డైట్ విద్యార్థికి బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థి జిల్లా పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్ దక్కించుకున్నారు. అనకాపల్లి జిల్లా పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్ ఈనెల 17న అనకాపల్లి జార్జ్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో డైట్ కళాశాలలో ఎంబీఏ సెకండియర్ విద్యార్థి ఎంకె లలితేశ్వరరావు పాల్గొని 83 కేజీల కేటగిరిలో 650 కేజీల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు. బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్లో 125 కేజీల బరువు ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ కాంపిటీషన్లో విజయం సాధించిన ఎంకె లలితేశ్వరరావుకు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ వైకుంఠ రావు అభినందనలు తెలియజేశారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనేందుకు కళాశాల ఎప్పుడు సహకరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ రామ్ కుమార్, కళాశాల పిడీ బి. శ్రీనివాస్‌రావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పతకాలు చూపుతున్న లలితేశ్వరరావు

ముత్యాల టీమ్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-రాంబిల్లి

ముత్యాల వెంకటేశ్వరరావు కుమారుడు ముత్యాల సతీష్ టీం సభ్యులు జిల్లాలోని ఎలమంచిలి నియోజకవర్గం పరిధి రాంబిల్లి గ్రామంలో మంగళవారం విస్తృతంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామపెద్దలను, మహిళలను, స్థానిక ఆటో యూనియన్ కార్యదర్శి శంకర్‌తో పాటు నాయకులను కలిశారు. ప్రజల అవసరాల కోసం ఎంవిఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. పార్టీలకతీతంగా చేపట్టిన సేవా కార్యక్రమాల తీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇప్పుడే ఇన్ని అభివృద్ధి పనులు నిర్వహిస్తున్న వ్యక్తి రాజకీయంలోకి వస్తే అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. దీనికి స్థానికుల నుంచి వస్తున్న స్పందన చాలా అద్భుతంగా ఉందని ఎంవిఆర్ అభిమానులు తెలిపారు.

ప్రచారం చేస్తున్న ముత్యాల టీమ్ సభ్యులు

నేటి నుంచి రైతు మద్దతు యాత్ర

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రైతు మద్దతు యాత్ర బుధవారం నుండి చేపడుతున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022- 23 సంవత్సరంలో రైతులకు బకాయి ఉన్న రూ.7 కోట్లను వెంటనే చెల్లించాలని, టన్నుకు రూ.3500 కనీస మద్దతు ధర ప్రకటించాలని, చెరకు సరఫరా చేసిన రైతులకు 15 రోజులకు ఒకసారి పేమెంట్లు ఇవ్వాలని, చెరుకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రోలుగుంట, జె.నాయుడు పాలెం, రావికమతం, చినపాచిల, తట్టబంద, వడ్డాది, బుచ్చయ్యపేట, పిఎస్ పేట కాటాల వద్ద రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జనసేన కార్యకర్తలతో పాటు రైతులు అధిక సంఖ్యలో పాల్గొవాలని ఆయన కోరారు.

7వ రోజుకు టిడిపి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 7వ రోజుకు చేరాయి.

యలమంచిలి : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా యలమంచిలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 7వ రోజుకు చేరుకున్నాయి. పార్టీ సీనియర్ నాయకులు పప్పల చలపతిరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు నేతృత్వంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొలుకులూరి విజయబాబు, రాజాన సూర్యనాగేశ్వరరావు, గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, జనసేన నాయకులు బొద్దపు శ్రీను, నారాయణమ్మ, సన్యాసినాయుడు, ఆదిమూర్తి పాల్గొన్నారు.

అనకాపల్లి : రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, అర్బన్ జిల్లా కార్యదర్శి శంకర్ల పద్మ, జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు ఆధ్వర్యాన పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కార్యాలయం చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 7వ రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకులు కాయల ప్రసన్న లక్ష్మీ, కోట్ని ఉమా, సీరంశెట్టి వెంకట లక్ష్మీ, భీశెట్టి హేమ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : జివిఎంసి 79వ వార్డు లంకెలపాలెంలో ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కార్యాలయం వద్ద సామూహిక నిరాహార దీక్ష మంగళవారం చేపట్టారు. దీనిని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, నాయకులు కరణం సత్యారావు, మచ్చా శివకుమార్, బొబ్బిరి సూర్య, గొల్లవిల్లి భవాని పాల్గొన్నారు.

నక్కపల్లి: చంద్రబాబు,అక్రమ అరెస్టును నిరసిస్తూ తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, స్థానిక మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆధ్వర్యంలో నక్కపల్లి ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద మంగళవారం నియోజకవర్గ మహిళా నేతలతోరిలే దీక్ష చేపట్టారు. .చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్యక్రమంలో లబ్ధి పొందిన యువకులతోపాటు ప్రపంచవ్యాప్తంగా పలువురు నిరసన చెబుతున్నా, వైసిపి ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో మరిన్ని కేసులను చంద్రబాబుపై పెట్టడం దుర్మార్గమన్నారు. కడిగిన ముత్యంలాచంద్రబాబు కేసు నుండి బయట పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు రమా కుమారి, మండల అధ్యక్షురాలు ఆకేటి శాంతి, పలువురు మహిళా నేతలు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు .

నక్కపల్లిలో మాట్లాడుతున్న వంగలపూడి అనిత

భీమిలి లైట్ హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

భీమునిపట్నం : జివిఎంసి 3వ వార్డు టిడిపి శ్రేణులు మంగళవారం స్థానిక బీచ్‌లోని లైట్ హౌస్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు చుక్క రమణ, పి లక్ష్మీకుమారి, ఎ.గురునాథ్, గండిబోయిన పోలిరాజు, ఎ.నూకరాజు, వియ్యపు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

భీమిలి పార్టీ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 10వ రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారిలక్ష్మి, గంటా అప్పలకొండ, మొల్లి హేమలత, పి.మంగమ్మ, మాజీ ఎంపిపి యరబాల కృష్ణవేణి, బోయి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : తెలుగు యువత ఆధ్వర్యాన పెందుర్తిలోని టిడిపి కార్యాలయం నుంచి కూడలి వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండారు అప్పలనాయుడు, కనకదేవుడు, డి.రమణ, శ్రీనుయాదవ్, జితేంద్ర, ఆవగడ్డ అప్పలనాయుడు, దాట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన గోపాలపట్నం మెయిన్ రోడ్డులో నిరసన తెలిపారు.

ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు సతీమణి సుజన ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. దీక్షకు కూర్చున్న రామకృష్ణబాబుకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి చోడే పట్టాభిరామ్ సతీమణి చోడే పద్మజ, లక్ష్మి, శ్రీలక్ష్మి, హేమ, గిరిజ, శ్రీదేవి, మాధవీ లత, దేవి, దీప్తి, అమ్మాజీ, భవిత పాల్గొన్నారు.

బుద్ద నాగజగదీషును అరెస్టు చేస్తున్న పోలీసులు

సింహాచలంలో అరెస్టులు, గృహ నిర్బంధాలు

సింహాచలం : చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ అప్పన్నను మొక్కుకునేందుకు ఆలయానికి వస్తున్న తెలుగుదేశం శ్రేణులను ఎసిపి అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యాన పోలీసులు అరెస్టు చేసి గోపాలపట్నం స్టేషన్‌కు తరలించారు. పలువురిని గృహ నిర్బంధం చేశారు. అరెస్టయిన వారిలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు తదితరులున్నారు.

గాంధీ విగ్రహానికి వినతి

అనకాపల్లి : రాష్ట్రంలో హింసా మార్గాన్ని నిరసిస్తూ స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో మహాత్మా గాంధీ విగ్రహానికి తెలుగు యువత నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు బొద్దేడ మురళి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రమంతా ఎమర్జెన్సీ నాటి రోజులు తలపిస్తున్నాయని, ప్రజాస్వామ్యానికి ఖూనీ జరుగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో మల్ల గణేష్, పొలిమేర నాయుడు, కర్రి మల్లేశ్వరరావు, బుద్ద భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో నిరసనలో స్థానిక టిడిపి నేతలు

నక్కపల్లి: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఢిల్లీలో మంగళవారం లోకేష్, టిడిపి ఎంపీలు, మాజీ ఎంపీలు ,మాజీ మంత్రులు చేపట్టిన మౌన దీక్షలో పాయకరావుపేట నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు.చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి బాపు ఘాట్ వద్ద మహాత్మునికి నివాళులర్పించి ,మౌన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నేతలు కొప్పిశెట్టి బుజ్జి, వినోద్ రాజు, లాలం కాశీ నాయుడు, గుర్రం రామకృష్ణ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు

ప్రమాద బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి- అచ్యుతాపురం

మండలంలోని ఎం.జగన్నాధపురం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు చనిపోయిన కాలుకొరన శివ భార్య నూకలక్ష్మికి వైయస్సార్ బీమా పథకంలో మంజూరైన ఐదు లక్షల రూపాయల చెక్కును మంగళవారం గ్రామ సచివాలయంలో మాజీ సర్పంచ్ భీముని వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. అలాగే గతంలో జరిగిన భూ సమగ్ర సర్వేలో మంజూరైన పట్టాదారు పాస్ పుస్తకాలను కూడా ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రావి శోభన్ బాబు, భీముని నాగేశ్వరరావు గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -చోడవరం

ఎస్‌సి ఎబిసిడి వర్గీకరణ కోసం చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు నీటిపల్లి ముత్యాలరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు చోడవరంలో చలో ఢిల్లీ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధనకై మాదిగ ఉద్యోగులు, మేధావులు మహాధర్నాను న్యూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వోర్తా శ్రీనివాసరావు, నాయకులు కొండెల్లి వెంకట్రావు, పెడమట్ల ఏసుదాసు, దేవుడుబాబు, రెల్లి ఉద్యోగ సంఘం నాయకులు వై.వరప్రసాద్, పొట్నూరి అప్పారావు పాల్గొన్నారు.

భారీ సెట్టింగ్‌లతో వినాయక విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రం దేవరాపల్లిలోని నాయుడు వీధిలో లవ్లీ బాయ్స్ ఆధ్వర్యాన భారీ సెట్టింగ్‌లతో చూపరులను ఆకట్టుకునే విధంగా వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొలి రెండు రోజులు ప్రశాంతంగా నిమజ్జనం

యలమంచిలి : సోమవారం మొదలైన వినాయక చవితి పూజా సంబరాలు తొలి రెండు రోజులూ ప్రశాంతంగా జరిగాయి. ఇళ్లలో పూజలు ఆచరించిన భక్తులు వందలాదిగా తరలి వెళ్లి వినాయక విగ్రహాలను పెంజెరువులో నిమజ్జనం చేశారు.

దేవరాపల్లిలో వినాయక విగ్రహాన్ని సందర్శించిన కిలపర్తి

దైవ దర్శనానికి వెళ్తే అరెస్టు చేయడం అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

సింహాద్రి అప్పన్న దైవ దర్శనానికి వెళ్తున్న తమను అనుమతులు ఉండాలంటూ విశాఖ పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు తరలించిన నేపథ్యంలో మంగళవారం సింహాద్రి అప్పన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించి క్షేమంగా ఉండాలని అక్రమ కేసులు తొలగిపోవాలని వేడుకోవడానికి వెళ్తున్న నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్ రెడ్డి హిందూ సాంప్రదాయాన్ని పాటించకుండా తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. జగన్‌రెడ్డి ప్రశాంతంగా లేకపోవడం వల్ల ఇతరులు కూడా ప్రశాంతంగా ఉండకూడదని ఉద్దేశంతో పోలీసులను వైసిపి ప్రైవేట్ సైన్యంగా వాడుకుంటూ టిడిపి శ్రేణులను రోడ్డు మీదకు రాకుండా అక్రమ నిర్బంధం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. జగన్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కుప్పిలి జగన్, బోడి వెంకట్రావు, విల్లూరి రమణబాబు, అండి బోయిన శేషు, డివివి అప్పారావు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - అచ్చుతాపురం : మండలంలోని దోసూరు గ్రామ సచివాలయం పరిధిలోని నూతనంగా మంజూరైన పింఛన్లను13 మంది లబ్ధిదారులకు మంగళవారం జడ్పీటీసీ నర్సాల కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సాల సుజాత, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, వైసిపి నాయకులు గండి రాజు, గొర్లి ప్రసన్న కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ రీగన్, పైల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు అందజేస్తున్న దృశ్యం

ప్రజలకు నిరంతర వైద్య సేవలు

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు సూచించారు. మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించి ఆసుపత్రి అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే నరసింహారావు, ఈఓపీఆర్డి కే ధర్మారావు, మండల కోఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు, పెద్దాడ రామ్ శంకర్, మొల్లేటి శివాజీ, పూడేరు సర్పంచ్ సిరిగిరి శెట్టి కృష్ణమోహన్, దాడి కుమార్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపిపి సూరిబాబు

జన ఆరోగ్య కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్య కేంద్రం అప్‌గ్రేడ్ కావడంతో జన ఆరోగ్య కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆయుర్వేద వైద్య అధికారి లావణ్య, గ్రామ సర్పంచ్ శిరపరపు శివ, ఎమ్‌పిటిసి కన్నూరు అచ్చియ్యమ్మ, ఆర్‌డిడి జోన్ 1 అధికారి వై శేఖర్‌తో ఏర్పాటైంది.

జన ఆరోగ్య కమిటీ నియామక పత్రం అందజేస్తున్న డాక్టర్ లావణ్య

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న స్వామి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు కొత్తవీధిలో రోడ్డుపనులకు కౌన్సిలర్ సభ్యులు లగుడు స్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సహకారంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో వార్డు అభివృద్ధిలో భాగంగా రెండు సిసి రోడ్ల నిర్మాణాలకు నిధులను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జిలు కిల్లాడ లోవ, ఎల్లేటి శ్రీనివాస్, వార్డు వైసిపి నాయకులు కాళ్ళ బాబ్జి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సినీ దర్శకునిగా గర్ణికం కుర్రోడు

ప్రజాశక్తి - రావికమతం : ఇంతవరకు షార్ట్ ఫిల్ములు తీస్తున్న మండలానికి చెందిన దర్శకుడు సాయిశ్రీనివాస్ బిగ్ స్క్రీన్‌పై అడుగుపెడుతుండడంతో ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. మండలంలో గర్ణికం గ్రామానికి చెందిన కేశంశెట్టి సాయిశ్రీనివాస్ తాను తీయబోయే ప్రాజెక్ట్ ఎస్‌ఎ పోస్టర్‌ను నిర్మాత దిల్‌రాజు విడుదల చేశారని తెలిపారు. సినిమాలపై మక్కువ తో హైదరాబాద్ వెళ్లిన సాయి శ్రీనివాస్ మణికర్ణికపురం, అమత, సారీ సిస్టర్ పేర్లతో షార్ట్ ఫిల్ములు తీశారు. యూట్యూబ్‌లో వీటికి ప్రేక్షక ఆదరణ పెరగడంతో ఒటిటి ప్లాట్ ఫారంపై 'ఏమి సందేహం లేదు' పేరుతో తీసిన మరో షార్ట్ ఫిలిమ్‌కు కూడా విశేష ప్రేక్షకాదరణ వచ్చింది. ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణ స్ఫూర్తిగా తీసుకొని బిగ్ స్క్రీన్ లోకి అడుగుపెట్టారు. శ్రీకృష్ణ భగవానుడు ఇతివృత్తంతోపాటు పల్లెటూరు నేపథ్యం, హీరో అన్యాయాలను ఎదిరించడంతో కూడిన కథతో సినిమా తీస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల ప్రేక్షకులకు అమితంగా ఆకట్టుకొనే రీతిలో చిత్రీకరణ సాగుతోందని దర్శకుడు సాయి శ్రీనివాస్ తెలిపారు. మోహన్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి వడిగొండ అర్జునప్పారావు నిర్మాతగా వ్యవహరిస్తున్నారని, సంగీతం నింపీ అందిస్తున్నారని తెలిపారు. సినిమాటోగ్రఫీ తోట నరేష్ కాగా, జయమ్మ పంచాయితీ ఫేమ్ దినేష్‌కుమార్ హీరోగా నటిస్తున్నారని, విజయనగరానికి చెందిన దియా రాజ్ హీరోయిన్‌గా పరిచయం అవుతుందన్నారు.

సమగ్ర భూసర్వే ప్రారంభం

ప్రజాశక్తి - రావికమతం : సమగ్ర భూసర్వేను సర్పంచ్ దాసరి సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ వరహాలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భాగం డ్రోన్ల సహాయంతో గ్రామంలో జిరాయితీ భూములు, అసైన్డ్ భూములు, చెరువులు, గెడ్డ పోరంబోకులు, శ్మశానవాటికలు మొదలగునవన్నీ సర్వే చేస్తారన్నారు. ప్రభుత్వ భూములు, ఆక్రమణలు, చెరువులు,అసైన్డ్ భూముల వాస్తవ పరిస్థితులను వీటి ద్వారాగుర్తిస్తారన్నారు. భవిష్యత్‌లో వివాదాలకు ఆస్కారం లేకుండా భూహక్కు పత్రాలను అందజేస్తారన్నారు కార్యక్రమంలో సర్వేయర్ రవి, వీఆర్‌ఎ శ్రీను, గ్రామ పెద్దలు కె.రాజారావు, ఆర్.సన్యాసిరావు, పి రాము, కె అప్పారావు పాల్గొన్నారు.

రక్తదాత సిఐ సుధాకర్

ప్రజాశక్తి -పాడేరు : పాడేరు పట్టణ సిఐ సుధాకర్ తన మానవత, దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వచ్ఛందంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ వద్ద వెళ్లి రక్తదానం చేస్తున్నారు. ఇప్పటికే 27వ సారి రక్తదానం చేశారు. పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించడంతోపాటు మానవతా దృక్పథంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణదాతగా సిఐ నిలుస్తున్నారని పలువురు అంటున్నారు. పాడేరు రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు ఏర్పడిన తర్వాత ఏడుసార్లు పాడేరు పట్టణంలోనే ఆయన రక్తదానం చేశారని అన్నారు . గతంలో విశాఖపట్నం,శ్రీకాకుళం రెడ్ క్రాస్ సొసైటీకి రక్తదానం చేశారని తెలిపారు. సిఐ చేస్తున్న రక్తదానాన్ని ఆదర్శంగా తీసుకొని మరింతమంది రక్తం దానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సభ్యులు పాల్గొన్నారు.

రాయితీపై ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు

జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

ఎండిన వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి- నక్కపల్లి : వర్షాభావంతో వరినాట్లు ఎండిపోయిన రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు తెలిపారు. మంగళవారం మండలంలో గొడిచెర్ల, చినరామభద్రపురం, దేవవరం గ్రామాల్లో క్షేత్రపర్యటనలో భాగంగా వరి పొలాలను పరిశీలించారు. గొడిచెర్లలో రైతులతో గ్రామసభ నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటలు, ఆరు తడి పంటలు అవకాశం వున్న చోట వేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నీరు లేక నారు ఎండిపోయిన, నాట్లు వేసుకోలేకపోయిన రైతులు జాబితా గుర్తించి 80 శాతం రాయితీపై వరి విత్తనాలు, రాగులు, అపరాలు వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా.కరువు ప్రాంతంగా ప్రకటించి, తమను ఆదుకోవాలని రైతులు కోరారు.కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఉమాప్రసాద్, రమణ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న సురక్ష వైద్యశిబిరాలు

పిహెచ్‌సికి కుర్చీలు బహూకరిస్తున్న ప్రత్యేక అధికారి

ప్రజాశక్తి- నక్కపల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30వ తేదీ నుండి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి త్రినాధరావు సూచించారు.. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించారు ఈనెల 15వ తేదీ నుండి ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని నమోదు చేయాలని సూచించారు. వాలంటీర్లు, ఆశాలు, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు ఇంటింటికి వెళ్లి ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటా చేపట్టే సర్వేలో గుర్తించిన రోగులందరికీ ఆయా గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి పూర్తిస్థాయిలో వైద్యం అందిస్తారన్నారు. గొడిచెర్ల పిహెచ్‌సికి 70 కుర్చీలను బహూకరించారు. కార్యక్రమంలో ఎంపిపి రత్నం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ అంబేద్కర్, ఎఒ సీతారామ రాజు, గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యాధికారి మురళీకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు .

సంక్షేమ హాస్టళ్లకు సన్న బియ్యం సరఫరా చేయాలి

గురుకులం వద్ద ప్రదర్శన చేస్తున్న దళిత నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : సంక్షేమ హాస్టళ్లకు సన్న బియ్యం సరఫరా చేయాలని దళిత సేవా పరిరక్షణ జిల్లా అధ్యక్షులు యాదగిరి దాసు, దళిత కులాల సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు చిట్ల చలపతి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల హాస్టల్ వద్ద ప్రదర్శన చేపట్టారు. రెండు నెలల క్రితం ఎన్‌టిఆర్ జిల్లాలో కలుషిత ఆహారం వలన హాస్టల్లోని విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారని విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడైనా సంక్షేమ హాస్టళ్ళకు సన్న బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23న దళిత ప్రతినిధుల గర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఎం అప్పలరాజు పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యార్థి మృతి కారకులను శిక్షించాలి

ఎస్‌ఎఫ్‌ఐ అల్లూరి జిల్లా అధ్యక్షుడు చిన్నారావు

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం బీడిపాలెం బాలుర ఆశ్రమ పాఠశాలలో నాలుగవ తరగతి విద్యార్థి కిల్లో వంశీకృష్ణ మృతిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి చిన్నారావు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వంశీకృష్ణకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యమే మృతికి కారణమని తెలుస్తోందన్నారు. ఆశ్రమ పాఠశాల వార్డెన్, సిబ్బంది, తోటి విద్యార్థులను విచారించి, వంశీకృష్ణ మృతికి కారణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏటా ఎపిడమిక్ సీజన్‌లో సంక్షేమ హాస్టల్స్, ఆశ్రమాల్లో అనారోగ్యంతో విద్యార్థుల అవస్థలు, మరణాలు సర్వసాధారణంగా మారినా విద్యార్థుల ఆరోగ్యం పట్ల, వైద్యసేవల్లో నిర్లక్ష్యం సరికాదన్నారు. గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే ప్రభుత్వం, అధికారుల్లో ఉన్న చులకన భావం వల్లే జ్వరమరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు .సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపం కూడా కారణమన్నారు. విద్యార్థి మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆశ్రమ హాస్టల్స్‌లో హెల్త్ వాలంటీర్స్‌ను నియమించాలని, రెగ్యులర్‌గా విద్యార్థుల ఆరోగ్యతనిఖీలకు వైద్యశిబిరాలను నిర్వహించాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్.మత్యరాజు, పి.సింహాద్రి, మండల నాయకులు వి.మహేంద్ర పాల్గొన్నారు.

ఒడ్డిమెట్టకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఒడ్డిమెట్టలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో సోమవారం గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు పోటెత్తారు.సుదూర ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి గణపతిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మంగళవారం ఆలయ అధికారులు హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ ఏడాది దర్శనం, ప్రత్యేక దర్శనం టికెట్లు, డొనేషన్లు, కేశఖండన, కొబ్బరి చెక్కల వేలం, హుండీల ద్వారా రూ. 4,08,485 లు ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నరిశే వెంకటేశ్వరరావు తెలిపారు. గత ఏడాది రూ. 3,93,00 ఆదాయం వచ్చిందన్నారు .

మహిళా బిల్లుకు ఆమోదం హర్షణీయం

ప్రజాశక్తి-గొలుగొండ :ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనకే పరిమితమైన మహిళా బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించడం ఎంతో హర్షణీయమని గొలుగొండ వైస్ ఎంపిపి జక్కు నాగమణి అన్నారు. మంగళవారం మాట్లాడుతూ మహిళా బిల్లు ఆమోదించడం వల్ల చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలవుతుందని, దీనివల్ల ప్రజాస్వామ్యంలో మహిళలు మరింత భాగస్వాములుగా నిలబడే అవకాశం దక్కుతుందన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించిన ఎంపీలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం ద్వారా సిఎం జగన్ మహిళా పక్షపాతిగా నిరూపించుకున్నారన్నారు.

23న దళిత ప్రతినిధుల గర్జన

గర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న దళిత ప్రతినిధులు

ప్రజాశక్తి -కోటవురట్ల: ఈనెల 23న నర్సీపట్నంలో నిర్వహించనున్న దళిత ప్రతినిధుల గర్జన పోస్టరును మంగళవారం రాట్నాలపాలెం అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహాల వద్ద జై భారత్ రాష్ట్ర కార్యదర్శి త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత గర్జన విజయవంతం చేయాలన్నారు. అదేవిధంగా అట్రాసిటీ కేసులో 41 నోటీసును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సేవ జిల్లా పరిరక్షణ అధ్యక్షులు యాదగిరి దాసు, చెట్ల చలపతి, గుడాల వెంకటరమణ, బోడపాటి రవికుమార్ ,నడుంపల్లి నూకరాజు, మాజీ సర్పంచ్ మాణిక్యం పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి- ఎస్ రాయవరం: కోడి పందేల శిబిరంపై దాడి చేసి , ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్ఐ పి ప్రసాదరావు తెలిపారు. తమకు వచ్చిన పక్కా సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం మండలంలో తిమ్మాపురం గ్రామ సమీపంలోని మామిడి తోటలో కోడి పందేల శిబిరంపై దాడిచేశామన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు పందెంరాయుళ్లను, రెండు కోళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి ఘనసత్కారం

స్వర్ణగౌరిని సత్కరిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన మండలంలో రేవుపోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు స్వర్ణగౌరిని మంగళవారం గ్రామ యువకులు బంగారు చిట్టి మిత్రులతో కలిసి పూలమాలల శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, యువకులు నూకరాజు, మధు, అప్పలరాజు, రాజు, జగన్నాథం, సత్తిబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యరక్ష సర్వే పరిశీలన

ఆరోగ్య సురక్ష సర్వే తీరును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

ప్రజాశక్తి -కోటవురట్ల: జగనన్న ఆరోగ్యరక్ష సర్వే పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఇంటింటికీ వెళ్ళి, సంపూర్ణ ఆరోగ్య డేటా షీట్ సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. మంగళవారం పలు గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15 నుండి నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారిని, రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలను, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించాలని, మలేరియా డెంగీ పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రోగుల వారీగా కేసుషీట్ తయారుచేస్తే, తర్వాత ఈనెల 30 నుంచి నిర్వహించే వైద్యశిబిరాల్లో వైద్యం అందిస్తారన్నారు. క్లిష్టతరమైన వ్యాధులకు ఆరోగ్యశ్రీ కింద అనుబంధ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందజేస్తారని తెలిపారు, కార్యక్రమంలో ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు

నక్కపల్లి విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఒ, హెచ్ఎం

ప్రజాశక్తి -నక్కపల్లి : రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి క్రీడాకారులు ఎంపికైనట్లు ఎంఇఒ కె.నరేష్ తెలిపారు. నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంగా ఇటీవల జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి పోటీల్లో అండర్ 14 బాలికల విభాగంలో స్థానిక బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థులు భవాని, మమత, కావ్య, శ్రావ్య, గాయత్రి, ప్రవల్లిక, వర్షిణి,అండర్ 17 బాలికల విభాగంలో వర్షిని, జాహ్నవి, కుసుమ, పూర్ణిమ, అదేవిధంగా అండర్ 17 బాలురు విభాగంలో స్థానిక హైస్కూలు విద్యార్థులు రోహిత్, రాజు, ధనుంజయ్, మణికంఠ, ప్రణీత్, అవినాష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఇఒ తెలిపారు.

మంగళవారం ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం రాణీలలిత, సుందరరావు, పిడిలు షేక్ బీబీ, బిఎస్.హాకీ ఫౌండర్ సూరిబాబు, కార్యదర్శి తాతాజీ, అధ్యక్షులు చిన్న అప్పారావు, గ్రామపెద్దలు, తదితరులు అభినందనలు తెలిపారు.

రాజాధిరాజ వాహనంపై తిరువీధి సేవ

- వైభవోపేతంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- నక్కపల్లి : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీదేవిభూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంలో తిరువీధి సేవ నిర్వహించారు. పలువురు భక్తులు స్వామిని దర్శించుకున్నారు .బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చక బృందం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు .భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

కొండ శిఖర గ్రామాల్లో సౌకర్యాలు కల్పించండి

ఆర్ల పంచాయతీ శివారు గ్రామాల ఆదివాసీల నిరసన

27న తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు సమాయత్తం

సమస్యల పరిష్కారానికి వేడుకుంటున్న గిరిజనులు

ప్రజాశక్తి-రోలుగుంట : కొండ శిఖర గ్రామాల్లో ఉన్న తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని మండలంలోని ఆర్ల పంచాయతీ కొండశిఖర గ్రామం నీలిబంద, పిత్రుగెడ్డ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 50 మంది జనాభా ఆదివాసి కొందు గిరిజనులు జీవనం సాగిస్తున్నామని, ఆర్ల పంచాయతీకి శరభవరం సచివాలయానికి 12 కిలోమీటర్ల దూరంలో కొండశిఖర గ్రామం, నీలబంద గ్రామంలో ఉన్న తమకు నేటికీ కరెంటు, మంచినీరు సౌకర్యం లేవన్నారు. స్వాతంత్రం వచ్చి నేటికి 76 సంవత్సరాలు దేశంలో ఆజాదికా అమృత ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో కొండశిఖర గ్రామానికి నేటికీ కనీస సౌకర్యాలు లేవన్నారు. గ్రామంలో గెమ్మెలి చిన్న, గెమ్మెలి చిలుకమ్మ, గెమ్మెలి రంభ, వంతల చంటి, గెమ్మెలి కుమారి, గెమ్మెలి సన్నిబాబు, పాంగి దస్రై, గెమ్మెల వాణి, గెమ్మెల సత్తిబాబు, గెమ్మెలిసీతమ్మ వీరితో పాటు పిత్రుగెడ్డ గ్రామంలో ఎనిమిది మంది ఓటు హక్కు లేవన్నారు. ఎనిమిది కుటుంబాలకు రేషన్ కార్డులు లేవన్నారు. రేషన్ కార్డు లేక తమ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు అనేక ఇబ్బందులు గురవుతున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు రావాలంటే రేషన్ కార్డులో పేర్లు ఉండాలని అంటున్నారని, సచివాలయానికి అనేకసార్లు తిరిగిన నేటికీ రేషన్ కార్డులు రాలేదన్నారు. దీంతో బియ్యం తీసుకురావాలంటే ప్రైవేట్ మార్కెట్లో కేజీ రూ.50 చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పదిమంది మహిళ వరకు ఉపాధి హామీ పథకం కార్డులో పేరు లేవన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రోడ్డు, కరెంటు, మంచినీటి సదుపాం కల్పన కోసం ఈనెల 27వ తేదీన మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని గ్రామానికి చెందిన కొర్రా కొండబాబు, గెమ్మెలి శ్రీను తదితరులు తెలిపారు.

22న గొలుగొండలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-గొలుగొండ : ఈ నెల 22న గొలుగొండలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జి.ఆనంద్ తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఇతర జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి వినతులు ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పవన్‌కల్యాణ్ వెంటే మేము'

స్పష్టం చేసిన నర్సీపట్నం జనసేన నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీరసూర్యచంద్ర స్పష్టం చేశారు. మంగళవారం నర్సీపట్నం ఎన్‌జిఒ హోమ్‌లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా టిడిపి, జనసేన ఎన్నికల పొత్తు శుభపరిణామమన్నారు. రానున్న రోజుల్లో పవన్ కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, 9వ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, రేగుబళ్ల శివ, డాక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఇఒ రామారావు

ప్రజాశక్తి -కోటవురట్ల: విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఇఒ రామారావు అన్నారు మంగళవారం గొల్లపేట పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు, విద్యార్థులతో పాటు ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు, చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంలో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు, కార్యక్రమంలో హెచ్ఎం జీవనరావు పాల్గొన్నారు.

విభిన్న రూపాల్లో ఘననాధుడు

విశాఖ మహానగరంలో వినాయక చవితి వేడుకలను పురస్కరించి పలుప్రాంతాల్లో విభిన్న ఆకృతుల్లో గణనాధులు కొలువు దీరారు. నగరంలోనే భారీ విగ్రహం గాజువాకలో ప్రతిష్టించగా, మిగతా ప్రాంతాల్లో చంద్రయాన్, ఆదిపురుష్, వారాహియాత్ర, అమ్మఒడి గణపతి ఇలా విభిన్న రూపాల్లో కొలువు దీరిన విఘ్నేశ్వరుని మండపాలు నగర వాసులను విశేషంగా అలరిస్తున్నాయి.
(విశాఖపట్నం, ప్రజాశక్తి)

గాజువాకలో భారీ గణనాధుడు

చంద్రయాన్ గణేషుడు

ఢీ డ్యాన్స్ పోటీల్లో గణపతి

న్యాయమూర్తి సిద్ధి వినాయకుడు

వారాహి గణపతి

అమ్మఒడిలో గణనాధుడు



పర్యావరణ హిత విఘ్నేశ్వరుడు

ఆది పురుష్ గణపయ్య